ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 28 సెప్టెంబరు 2025



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154



ధర్మవరంలోని నేసేపేటలో రోడ్డుపై పడేసిన ప్లాస్టిక్ కవర్లు

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్రజారోగ్యాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా... ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మార్పు రావడం లేదు. వాటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్‌ను విపరీతంగా వినియోగిస్తున్నారు. ఆఖరుకు కిల్లీ కొట్టులో కూడా ప్లాస్టిక్ కవర్ దొరుకుతోంది. ప్లాస్టిక్ కవర్ భూమిలో కలిసిపోవడానికి చాలా ఏళ్లు పడుతుంది. ఈలోపు అది ఎంతో కీడు చేస్తుంది. అందువల్ల పాలిథిన్, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం



ప్లాస్టిక్ పడగ..!

అరికట్టలేకపోతున్న అధికారులు

- రోగాల బారిన జనం
- తెరపైకి మళ్లీ ప్లాస్టిక్ నిషేధం
- ఈ సారైనా సక్రమంగా అమలయ్యేనా..?

72 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వస్తువులేని ఇల్లు లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలులేని మురుగు కాలువ కనబడదు. ధర్మవరం మున్సిపాలిటీలో రోజుకు 72 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఇందులో ప్లాస్టిక్ వ్యర్థాల వాటా 40శాతం వరకు ఉంటుంది. స్వచ్ఛ భారత్ పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కి పెడుతున్నారనే విమర్శలున్నాయి.

వారానికి ఐదు మిల్లీగ్రాములు

ప్రతిఒక్కరూ రోజూ ప్లాస్టిక్ వాడి పడేస్తున్నారు. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు, టీ తదితర ఆహార పదార్థాలు తీసుకురావడంతోపాటు ప్యాకింగ్‌కు కూడా వాటినే వాడుతున్నారు. ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారుచేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా మనిషి శరీరంలోకి వారానికి సగటున 5మిల్లీగ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటి వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు వస్తున్నాయి. చర్మవ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో రకరకాల జబ్బుల బారిన పడుతున్నారు. ఇంత ముప్పు ఉన్నా.. యథేచ్ఛగా ప్లాస్టిక్ వాడుతుండడం శోచనీయం.



కొబ్బరి నీరు ఇవ్వడానికి ఉంచుకున్న ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు

టీ కప్పుతో క్యాన్సర్

ప్లాస్టిక్‌తో తయారయ్యే టీ కప్పులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథిన్ సంచుల వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీ పాలిథిన్ కవర్‌లో వేసి ఇస్తున్నారు. తద్వారా పాలిథిన్ కవర్ టీలో కలిసి పోతోంది. అది తాగిన వారికి కొన్ని రోజులకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్పుల్లో సైతం ప్లాస్టిక్ పొర ఉంటుంది. వీటిని కూడా కాఫీ, టీలు తాగడానికి వాడరాదు. 75 మైక్రాన్లలోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు. ఇలాంటి పాలిథిన్ కవర్లను ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తున్నారు. వినియోగించిన పాలిథిన్ కవర్లను రోడ్లపై వేస్తుండడంతో అందులో మిగిలిన ఆహారం కోసం వాటిని తిని మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నాం

అక్టోబరు 2 నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధిస్తున్నాం. ఇది వరకే దుకాణాలు, హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లను వాడరాదని అవగాహన కల్పించాం. ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న దుకాణాలు, హోటళ్లపై జరిమానాలు విధించాం. తొలి విడతలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధం విధిస్తాం. తరువాత సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- శామ్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ధర్మవరం

ఖాద్రీశుడి కృష్ణావతారం



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీవారు శనివారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

లలితాదేవిగా దుర్గమ్మ

లేపాక్షి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా లేపాక్షి దుర్గాదేవి లలితాదేవిగా భక్తులను అనుగ్రహించారు. దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు కొనసాగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.



లలితా దేవి అలంకరణలో దుర్గాదేవి

వడివడిగా..

- మడకశిర ప్రాంతానికి కృష్ణా జలాలు
- తొలుత మణూరు, హరేసముద్రం చెరువులకు..
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మడకశిర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కరువుతో నోళ్లు తెరిచిన బీడు భూములు కృష్ణమ్మ రాకతో సస్యశ్యామలం కానున్నాయి. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల చొరవ, ప్రభుత్వ చల్లని చూపుతో కృష్ణా జలాలు హంద్రీనీవా ద్వారా చేరి మడకశిర ప్రాంత భూముల దాహార్తిని తీర్చనున్నాయి. ప్రస్తుతం కృష్ణానది జలాలు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని నల్లనాయని పల్లి నుంచి హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు చేరుతున్నాయి. తొలుత మణూరు, హరేసముద్రం చెరువులు నిండనున్నాయి. తరువాత మిగతా చెరువులకు చేరనున్నాయి.



మడకశిర ప్రాంతంలో హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలు

రిజర్వాయర్ నుంచి నేరుగా..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలను గత మార్చి నెలలో విడుదల చేశారు. పెనుకొండ, హిందూపురం వరకు నీరు చేరాయి. అయితే మడకశిరకు రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర ప్రాంతంలో పర్యటించినప్పడు కృష్ణా నది జలాలతో మడకశిర ప్రాంతంలోని చెరువులను నింపుతానని హామీ ఇచ్చారు. ఆ మేరకు మడకశిర ప్రాంతానికి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని నల్లనాయని పల్లి సమీపం నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మణూరు, హరేసముద్రం చెరువుకు చేరనున్నాయి. నీళ్లు వస్తున్న విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జలాలు ఇప్పటి వరకు మడకశిర ప్రాంతంలోని ఐదు చెరువులకు మాత్రమే చేరాయని, నియోజకవర్గంలోని 125 చెరువులను కూడా నింపాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులను చేరుతున్న కృష్ణమ్మ

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ప్రాంతంలోని చెరువులకు నేరుగా కృష్ణా జలాలు హంద్రీనీవా ద్వారా చేరుతున్నాయి. ప్రస్తుతం నల్లనాయనిపల్లి సమీపం నుంచి హంద్రీనీవా కాలువ పారుతుంది. మణూరు, హరేసముద్రం చెరువులు నిండిన తర్వాత మిగతా చెరువులకు నీరు చేరుతాయి.

- నాగార్జున, ఏఈ, హెచ్ఎన్ఎస్ఎస్



మణూరు చెరువుకు చేరిన కృష్ణా జలాలు

కార్మికరాజ్య స్థాపనతోనే సమాజ రక్షణ

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం
సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు
ఘనంగా మొదలైన సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్మిక రాజ్య స్థాపనతోనే సమాజ రక్షణ సాధ్యమని, అదే లక్ష్యంగా కార్మికవర్గం ముందుకు సాగాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం జరిగిన సీఐటీయూ జిల్లా 11వ మహాసభలలో ఆయన ప్రసంగించారు. అంతకు మునుపు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ నాయకుడు ఏజీ రాజమోహన్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ నాగమణి, సాకే నాగరాజు, శ్రీనివాసులు సంయుక్త అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్మికులకు సంతాప తీర్మానాన్ని కమిటీ సభ్యుడు గోపాల్ ప్రవేశపెట్టి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడారు. దేశంలో శ్రమదోపిడీ పెరిగిందని, ప్రధాని మోదీ

(మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

హార్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

పుట్టపర్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వరల్డ్ హార్ట్‌డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శనివారం ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలోని ఉత్తర భవనం -1 వద్ద ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈనెల 29న వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా 350 మంది రోగులకు గుండెకు సంబంధించి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎగ్జిబిషన్ డైరెక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

కొనసాగిన యజ్ఞం

విశ్వశాంతి కోసం చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం రెండో రోజు శనివారం కొనసాగింది. పూర్ణచంద్ర హాల్‌లో వేదపండితులు గణపతిపూజతో యజ్ఞాన్ని ప్రారంభించి, సర్వదేవతార్చన చేశారు. సాయికుల్వంతు సభామండపంలో సంగీత గాన కచేరి నిర్వహించారు. కార్యక్రమాల్లో వేలాది భక్తులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి: ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో శనివారం ఆయన వాల్మీకుల సమస్యపై మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వాల్మీకుల పరిస్థితులపై అధ్యయనం చేయించారని, ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. రాయలసీమలో ఎంతో కాలంగా వాల్మీకులు, బోయలు ఎస్టీ గుర్తింపు కోసం ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు.

తుది దశకు ఎంపిక జాబితా

జిల్లాలో వాహనమిత్రకు 5,897మందికి అర్హత

దసరాకు అందనున్న కానుక

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకం ద్వారా ఆటోడ్రైవర్లకు దసరా కానుక అందించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈపథకం కింద ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.15వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. ఈనేపథ్యంలో అర్హుల ఎంపిక తుది దశకు వచ్చింది. ఈనెల 23వరకు సచివాలయ పరిధిలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించారు. జిల్లాలో వాహన మిత్ర కోసం 6,038మంది దరఖాస్తు చేసుకోగా, 5,897మందిని ఎంపిక చేశారు. వివిధ కారణాలతో 133 దరఖాస్తులను తిరస్కరించారు. పెండింగ్‌లో 8 దరఖాస్తులున్నాయి. వాహనమిత్ర పథకానికి హిందూపురం అర్బన్‌లో అత్యధికంగా 499మంది దరఖాస్తు చేసుకోగా, అగళి మండలంలో అత్యల్పంగా 14మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి, అర్హత ఉంటే ఎంపిక చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎంపిక పూర్తి అయిన తరువాత అర్హుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు.

అర్హులందరికి లబ్ధి

జిల్లాలో వాహన మిత్ర పథకం లబ్ధి అర్హులందరికి కలుగుతుంది. తిరస్కరణకు గురైన వారిలో అర్హులుంటే వారు సంబంధిత అధికారులను సచివాలయాల్లో కలిసి, దరఖాస్తును పునఃపరిశీలన చేయించుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న ప్రతి దరఖాస్తును, దరఖాస్తుదారున్ని లబ్ధిదారుగా ఎంపిక చేస్తాం.

- సుధాకర్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి

నాగమణిపై కేసు నమోదు

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను దూషిస్తూ సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పోస్టు చేసిన నాగమణి అనే మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె మాట్లాడిన వీడియోను తెలుగు మహిళలు హిందూపురం వన్‌టౌన్ పోలీసులకు అందించి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వీడియోను పరిశీలించి, నాగమణిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ మహేష్ తెలిపారు.



విపత్తు..!

- జాడలేని ప్రత్యామ్నాయ విత్తనాలు
- ఉలవల కోసం రైతుల ఎదురు చూపు
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికార యంత్రాంగం



తనకల్లు మండలంలో ట్రాక్టర్‌తో భూమిని చదును చేయిస్తున్న రైతు

తనకల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చాలామంది రైతులు తమ పొలాలను బీళ్లుగా వదిలేశారు. అయితే రబీ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. దీంతో రైతులు పొలాలను దుక్కి దున్ని, పంటలు సాగు చేయడానికి సిద్ధం చేసుకుంటున్నారు. వర్షం పడితే విత్తనం వేయడానికి సమాయత్తమవుతున్నారు. రబీ సీజన్‌లో మండలంలో ఉలవ, ఉద్ది, కొర్రలు సాగు చేస్తారు. ప్రభుత్వం ఇప్పటివరకు విత్తనాలను సరఫరా చేయలేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం సకాలంలో విత్తనాలు సరఫరా చేసి ఉంటే, ఇప్పుడు కురుస్తున్న వర్షాలకే ఉలవ, ఉద్ది, కొర్రలు, ముద్దజొన్నలు సాగు చేసేవారమని పలువురు రైతులు చెబుతున్నారు. అయితే ప్రత్యామ్నాయ విత్తన సరఫరా, పంపిణీపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు విత్తనాల కోసం కర్ణాటకలోని చింతామణి, బాగేపల్లి, చేలూరు, ప్రాంతాలకెళుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, అదును దాటకనే ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

నివేదికలు పంపాం: సనావుల్లా, ఏడీఏ

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇప్పటికే నివేదికలు పంపాం. కదిరి ప్రాంతంలో రబీ సీజన్‌లో రైతులు ఉలవ సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఉలవల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నాలుగురోజుల్లోపు విత్తనాలు మండలాలకు చేరే అవకాశం ఉంది.

అదును దాటిపోతుందేమో



ఇప్పటికే ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తన సరఫరా చేసి ఉండాల్సింది. రబీలో ఉలవ సాగుచేయడానికి ఇదే సరైన సమయం. అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ, కాలం వెళ్లదీస్తే, ఉలవ సాగుచేయడానికి అదును దాటిపోతుందన్నారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ప్రత్యామ్నాయ విత్తనలను రైతులకు అందించాలి.

- మల్లిరెడ్డి, రైతు,గందోడివారిపల్లి

ఎదురు చూస్తున్నాం: బయ్యారెడ్డి, రైతు, నడిమికుంటపల్లి




ఖరీఫ్‌లో వర్షాలు పడక వేరుశనగ సాగుచేయలేదు. రబీలో ముందస్తు వర్షాలు రావడంతో భూములన్ని దుక్కి చేశాం. విత్తనాలుంటే ఇప్పటికే పంట సాగుచేసేవారం. ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేస్తుందని, ఎదురు చూస్తున్నాం. ఉలవను రైతులకు సరఫరా చేయాలి.

జర్మనీలో ఉద్యోగాలు

కదిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఫిజియో థెరపీ, ఆపరేషన్ టెక్నీషియన్ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్స్ డైవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామని ఆ సంస్థ అధికారి హరిక్రిష్ణ తెలిపారు. డీపీడీ, డిప్లమో పూర్తి చేసిన 18 నుంచి 40 ఏళ్ల వయసువారు శిక్షణకు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామని, పూర్తి వివరాలకు 9390176421 నంబరులో సంప్రదించాలని కోరారు.



అనంతపురం బస్టాండులో రద్దీ



అనంతపురం రైల్వే స్టేషన్‌లో ట్రాక్.. ప్లాట్ ఫాం ప్రయాణికులు.. బెంగళూరు ప్యాసింజర్ ఎక్కేందుకు నిరీక్షణ



బస్సులో సీట్ల కోసం..

బస్సులు.. రైళ్లు కిటకిట

- ఇంటర్ విద్యార్థులకు సెలవుతో రద్దీ
- స్టాండ్‌లోకి చేరకనే కిక్కిరిసిన బస్సులు
- ప్లాట్ ఫాం పట్టక.. ట్రాక్‌పైకి ప్రయాణికులు

అనంతపురం న్యూటౌన్/టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్లాట్‌ఫాంపై నిలబడేందుకు చోటు లేక చాలామంది ట్రాక్ పైకి వెళ్లారు. మిడ్ టర్మ్ పరీక్షలు పూర్తి కావడంతో ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి సెలవులు ప్రకటించారు. హాస్టల్ విద్యార్థులంతా సొంతూరి బాట పట్టారు. ఈ కారణంగా బస్సులు, రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. అనంతపురం బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లక ముందే బయటే నిండిపోయాయి. స్టాండ్‌లోకి కూడా రాకుండా బయటి నుంచి కొన్ని బస్సులు వెళ్లిపోయాయి. ఇక బెంగళూరు ప్యాసింజర్ (66560) రైలుకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ప్యాసింజర్ ట్రైన్ మధ్యాహ్నం 2.10 గంటలకు ఉన్నా.. 12 గంటలకే ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకుని వేచి చూశారు. రైలు 20 నిమిషాలు ఆలస్యంగా స్టేషన్‌కు చేరుకుంది. నాలుగో నంబరు ప్లాట్‌ఫాం పైకి రైలు వస్తుందని అనౌన్స్‌మెంట్ వినగానే ప్రయాణికులు ఒక్కసారిగా 3వ నంబర్ ప్లాట్‌ఫాం వైపు నుంచి ట్రాక్‌పైకి దూకేశారు. రైలు రాగానే సీట్ల కోసం తోసుకుంటూ లోపలికి వెళ్లారు. రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో పరిస్థితి ప్రమాదకరంగా కనిపించింది.





బస్టాండ్ బయటే బస్సెక్కుదాం.. పద తల్లీ..



మనూరి బస్సు అక్కడే నిలబడింది.. పరిగెత్తండి..



నిలబడేందుకు స్థలం ఉన్నా చాలు.. ఊరికి పోదాం..



రైలు కదిలేలోగా దూరిపోదాం..

జనగణనలో కులగణన చేపట్టాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని రాజకీయ, కుల, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్జీఓ హోంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ మేయర్ రాగే పరశురాం, బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, కాంగ్రెస్ నాయకులు సాకే శంకర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా 5 నుంచి 15 శాతం వరకూ ఉన్న అగ్రకులాల నాయకులు పాలన సాగిస్తున్నారని అన్నారు. బీసీ కులాల నాయకులు 50 నుంచి 70 శాతం ఉన్నా.. చిన్న చిన్న పోస్టులను అడుక్కునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీ కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కులగణన చేపట్టి, ఆ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించారని అన్నారు. మన రాష్ట్రంలో ఎన్నికల సమయంలో బీసీల జపం చేస్తూనే, కులగణనకు ముందుకు రావడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి హక్కులను సాధించుకునేందుకు బీసీ, ఎ స్సీ, ఎస్టీ, మైనార్టీ కుల సంఘాలతో ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. దీనికోసం అక్టోబరు 4న నగరంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని నియోజకవర్గాల నుంచి బీసీలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పిస్తామని ఉన్నతి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసి, 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ యువకులు అర్హులని తెలిపారు.

ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందని తెలిపారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి 35 రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని కోరారు.

కార్మికరాజ్య స్థాపనతోనే సమాజ రక్షణ

(7వ పేజీ తరువాయి)

కార్మిక వ్యతిరేకి అని అన్నారు. సంపద సృష్టికర్తలైన కార్మికులను ప్రోత్సహించాల్సింది పోయి పెట్టుబడిదారులకు దాసోహమయ్యేలా లేబర్ కోడ్‌లు తెచ్చారని మండిపడ్డారు. బ్రిటీష్ పాలనలోనూ నిత్యావసర వస్తువులపై సుంకాలు వేయలేదని, సంపన్నులకు మాత్రమే విధించేవారని అన్నారు. కానీ మోదీ ప్రభుత్వం నిత్యావసరాలపై పన్నులు విధించి, ఇప్పుడు తగ్గిస్తోందని అన్నారు. పీపీపీ విధానంతో పేదరికం లేకుండా చేస్తామంటూనే మరింత పేదరికంలోకి నెట్టివేసే విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. అత్యంత ధనికుడైన ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నిలిచారని, అయితే రాష్ట్రంలో కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా 10 గంటల పనివిధానాన్ని అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం నష్టదాయకమని అన్నా రు. ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనివిధానం, కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్ట్ - అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉచిత విద్య, వైద్యం తదితరవాటి అమలుకోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిసెంబరు 31, జనవరి 1, 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నంలో సీఐటీయూ జాతీయ మహాసభలు జరుగుతాయని, అక్కడ భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

హక్కుల పరిరరక్షణే లక్ష్యం..

కార్మికుల హక్కులను కాపాడడమే సీఐటీయూ ఏకైక లక్ష్యమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. సమానపనికి సమాన వేతనం అమలు చేయించడమే ధ్యేయమని అన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అనేక పోరాటాలు చేశామని అన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం, ఆశా, అంగన్వాడీ, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు, ఉపాధి కూలీలు, ఆటో కార్మికుల సమస్యలపై పోరాడామని అన్నారు. మహాసభలకు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, కౌలురైతు సంగం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్యలు మద్దతు తెలిపారు.

22ఏ ఫైళ్లకు పరిష్కారం

కలెక్టరేట్‌లో అధికారుల కుస్తీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22ఏ భూముల ఫైళ్ల పరిష్కారానికి అధికారులు కుస్తీ పట్టారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు తమ పరిధిలోని ఫైళ్లను శుక్ర, శనివారాల్లో పరిశీలించారు. శుక్రవారం ఒక్క రోజే 80 ఫైళ్లకు పరిష్కారం చూపారు. ఇది వరకు ప్రతి శుక్రవారం 22ఏ, చుక్కల భూములకు పరిష్కారం చూపేవారు. కానీ ఒకేసారి అధిక సంఖ్యలో ఫైళ్లను వెరిఫై చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. దీంతో రెండు రోజుల వ్యవధిలోనే 900 పైచిలుకు ఫైళ్లను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఇందులో 150 వరకు ఫైళ్లను పరిష్కరించి, మరికొన్ని తిరస్కరించారు. సరైన డాక్యుమెంట్లు లేనివాటిని మరోసారి పరిశీలించనున్నారు.



రెవెన్యూ భవన్‌లో 22ఏ ఫైళ్ల వెరిఫికేషన్‌లో అధికారులు, సిబ్బంది

కొన్ని మాయం

మండలాల వారిగా 22ఏ ఫైళ్ల గురించి ఆన్‌లైన్ ఆధారంగా కలెక్టర్ ఆరా తీశారు. వాటిలో కొన్ని ఫైళ్లు మాన్యువల్‌గా మిస్ అయినట్లు తెలిసింది. వాటి గురించి నిలదీస్తే, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు, డీటీలు, తహసీల్దార్లు ఒకరిపై మరొకరు చెప్పుకున్నట్లు తెలిసింది. మరోసారి పరిశీలించాలని, పత్రాలను దరఖాస్తుదారుల నుంచి తెప్పించుకోవాలని ఆదేశించారు. ఫైళ్ల తనిఖీని కలెక్టర్, జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల పర్యవేక్షించారు.

ఉద్యోగోన్నతుల కోసం ఆందోళన



గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితాను వెంటనే ప్రకటించి, అర్హత ఆధారంగా ఉద్యోగోన్నతులను కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. నగరంలోని అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలల బకాయిలు చెల్లించాలని జేఏసీ నాయకులు సుధాకర్, మల్లికార్జున, హనుమంతు, చంద్ర డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఇంటింటి సర్వే సేవలను పూర్తి రద్దు చేయాలని అన్నారు. మాతృశాఖను నిర్ణయించి, జాబ్ చార్ట్ ప్రకారం విధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

గురువులకు నియామక పత్రాలు



నియామక పత్రాలను అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఇతర కారణాలతో అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ సభకు వెళ్లని కొత్త ఉపాధ్యాయులకు తన కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం నియామక పత్రాలన అందజేశారు. వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనంతపురం, ఉరవకొండ, గుత్తి, పుట్లూరు మండలాల్లో శనివారం చిరుజల్లులు పడ్డాయి. శుక్రవారం 21 మండలాల్లో వర్షం కురిసింది. విడపనకల్లులో 1.1, గుత్తిలో ఒక సెంటీ మీటరు వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వదలని కంపు..!


ఆగిన అండర్ డ్రైనేజీ పనులు.. రోడ్లపై పారుతున్న మురుగునీరు

- రూ.కోటికిపైగా బిల్లులు మంజూరు
- దుర్గంధంతో శింగనమల ప్రజల ఇబ్బంది



డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్త

శింగనమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన అండర్ డ్రైనేజీ పనులు ఆగిపోయాయి. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ వాటిని అర్థాంతరంగా ఆపేశాడు. దీంతో మురుగు నీరంతా గ్రామంలో రోడ్లపైనే ఎక్కడబడితే అక్కడ పారుతోంది. మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి చదువుకున్న గ్రామమైన శింగనమలకు వైసీపీ పాలనలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఇందుకోసం రూ.1.5కోట్ల నిధులను మంజూరు చేయించారు. పనుల కోసం 70శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 30శాతం గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య (ఎస్‌బీఎం) నిధులు కేటాయించారు. దీంతో ఎస్సీకాలనీ నుంచి దర్గా వరకు కాలువలు తీశారు. మిగతా కొన్ని చోట్ల పనులు చేశారు. అయితే మురుగునీరు కాలువలోకి వెళ్లేలా చేయకుండా పక్కకు వెళ్లేలా చేశారు. పనులు నాసిరకంగా చేసి రూ.కోటికిపైగా బిల్లులు చేసుకున్నారు. తర్వాత బిల్లులు రాలేదని పనులు పూర్తి చేయకుండా అర్థాంతరంగా ఆపేశారు. పనులు పూర్తి చేయాలని గ్రామ పెద్దలు అప్పట్లోనే కాంట్రాక్టర్‌ను బతిమాలినా ఆయన పట్టించులేదు. కాంట్రాక్టర్ సాంబశివారెడ్డికి సమీప బంధువు కావడంతో చేసిన పనులకంటే ఎక్కువగానే బిల్లులు మంజూరు చేయించుకున్నట్లు సమాచారం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి మిగిలిన నిధులతో అండర్ డ్రైనేజ్ పనులు పూర్తి చేసి గ్రామంలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అప్పటి శిలా ఫలకం ←

మిగులు నిధులు లేవు



శింగనమలలో 2022లో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టారు. ఈపనులకు సంబంధించి మిగులు నిధులు ఉన్నట్లు మా కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేవు. ఈపనులకు సంబంధించి మొత్తం నిధులు బిల్లులు అయినట్లు తెలుస్తోంది. పై అధికారుల నుంచి నిధులు ఉన్నట్లు సమాచారం వస్తే మిగిలిన పనులు పూర్తి చేయిస్తాం.

- రవీంద్రనాథ్ రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



సగం వరకు కట్టి నిలిపేసిన డ్రైనేజీ కాలువ


దుర్వాసనతో ఇబ్బంది



శింగనమల బస్టాండ్‌లో హోటల్ పెట్టుకుని జీవనోపాధి పొందుతు న్నా. మా ఊరిలో ఇష్టారాజ్యంగా డ్రైనేజీ కాలువలు నిర్మించారు. పైనుంచి వచ్చే మురుగు నీరంతా కాలువలోకి పోకుండా మా హోటల్ వద్దకు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో టీ, కాఫీ, టిఫిన్‌కు వచ్చే కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాను రాను రావడం మానేస్తున్నారు. ఈక్రమంలో నాకు నష్టాలు తప్పడం లేదు. డ్రైనేజీ కాలువల పనులు నాసిరంగా చేయడంతోనే మురుగు నీరు కిందికి పోవడం లేదు.

- ఈడిగ శంకర్‌గౌడ్

కంపు భరించలేక..



ఊరికి చివరలో మా ఇల్లు ఉంది. మురుగు నీరంతా మా ఇంటి వద్దకు వచ్చి చేరుతోంది. మా ఇంటి వద్ద నుంచి పోయే డ్రైనేజీ కాలువలు ఎక్కడికక్కడ బ్లాక్ కావడంతో మురుగునీరు అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో భరించలేని దుర్గంధం వస్తోంది. కంపు భరించలేక ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాము. అయినా వారు పట్టించుకోకపోవడంతో సొంతింటిని ఇంటిని వదిలేసి గ్రామంలో మరో అద్దె ఇంటికి చేరాము.

- దాసరి వెంకటనారాయణ(జడేజా)

బొమ్మల పండుగ

- జిల్లాలో పెరుగుతున్న బొమ్మలకొలువు సంప్రదాయం



బొమ్మల కొలువును చూపుతున్న మల్లిక కుటుంబం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగు రంగుల బొమ్మలు. అందులో వివిధ రూపాల్లోని దేవతలు, మనుషులు, పశుపక్ష్యాదుల బొమ్మలను అందంగా, ఓ క్రమపద్ధతిలో కొలువుదీర్చి చేసుకునే పండుగ బొమ్మల కొలువు. ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా బొమ్మల కొలువు నిర్వహించడం తరాలుగా వస్తున్న సంప్రదాయం. కాలనుగుణమైన మార్పుల్లో భాగంగా ఈ బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడానికి కాస్త గ్యాప్ వచ్చినా ఇటీవల ఈ కార్యక్రమాలు పలుచోట్ల ఊపందుకున్నాయి. అపార్ట్‌మెంట్ కల్చర్‌లోనూ ఇవి సామాజిక వేడుకల్లా మారాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి నవరాత్రులను శోభాయమానంగా జరుపుకుంటున్నారు.

రూ.రెండు లక్షలకు పైగా వెచ్చించాం



ప్రతిఏటా బొమ్మలకొలువు ఏర్పాటు చేయడం మా ఇంటి సంప్రదాయం. ప్రతి ఏడాది కొత్త కొత్త బొమ్మలను ఉంచుతాం. ఇందుకోసమే ప్రత్యేకంగా ఇతర ప్రాంతాలకు విహారయాత్రలా వెళ్లి బొమ్మలను కొనుగోలు చేస్తాం. ఇప్పటివరకూ చెన్నై, బెంగళూరు, తంజావూరు, కొండపల్లి, హైదరాబాద్, అహ్మదాబాద్ ఇలా రకరకాల ప్రాంతాలనుంచి బొమ్మలు తీసుకొచ్చాం. ఇప్పటివరకూ రూ.2లక్షలకు పైగా బొమ్మల కోసమే ఖర్చు చేశాం. నవరాత్రుల్లో ప్రతిరోజూ స్థానిక మహిళలను ఇంటికి పిలిచి పేరంటాలు నిర్వహిస్తుంటాం. ఏడాదికేడాది మా ఇంటికి వచ్చి బొమ్మలకొలువును తిలకించేవారు పెరుగుతున్నారు.

- మల్లిక, బొమ్మలకొలువు నిర్వాహకురాలు



బొమ్మల కొలువులోని ఓ ఘట్టం

40 వేల బొమ్మలతో...

నగరంలోని ఆర్‌కే నగర్‌కు చెందిన కెనరాబ్యాంకు విశ్రాంత ఉద్యోగి కమలాకర్, మల్లిక దంపతులు ప్రతి ఏటా బొమ్మల కొలువును వారి నివాసంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ 40వేలకు పైగా బొమ్మలను సేకరించారు. ప్రతి ఏటా దసరా నవరాత్రుల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి, దాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల వారిని ఆహ్వానిస్తున్నారు. వీరి సంప్రదాయాన్ని కుమారుడు నీలమేఘశ్యామ్, తేజశ్విని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకించి శ్రీకృష్ణలీలలు, మహాబలిపురం, సంపూర్ణ రామాయణం, టీటీడీ బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ, మయాబజార్ ఘటోత్కచుడి విందు, కంచి కామాక్షి ఊరేగింపు వంటి ఘట్టాలను బొమ్మలద్వారా కొలువుదీర్చారు. ఈసారి దసరా నవరాత్రుల్లో భాగంగా శివకోటి దేవాలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, రెండోరోడ్డులోని శ్రీ జ్ఞాన పీఠంలోనూ ప్రత్యేకంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు.

రామావతార ఘట్టాలు



శ్రీకృష్ణావతారం..



గుమ్మఘట్ట ఎంఈఓ-2కు షోకాజ్ నోటీసు

అనంతపురం విద్య, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రకు ఆర్జేడీ శామ్యూల్ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అర్హత లేకున్నా తన భార్యకు అసిస్టెంట్ ఐఈడీ పోస్టు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, పత్రికలు, సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ ఫిర్యాదు చేయడంతో ఆయనను ఆర్జేడీ వివరణ కోరారు. ఏపీసీ శైలజను వేధిస్తున్నారని, విధులకు సరిగా వెళ్లడంలేదని ఆధారాలతో లీప్ యాప్‌లో ఫిర్యాదులు వచ్చినట్లు షోకాజ్ నోటీసులలో పేర్కొన్నారు. వీటిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులు వచ్చిన విషయాన్ని ఎంఈఓ-2 రామచంద్ర ధ్రువీకరించారు. ఈ వ్యవహారం విద్యాశాఖ వర్గాలలో తీవ్ర దుమారం రేపుతోంది.

పీజీలో 213 మంది చేరిక

అనంతపురం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మొదటి విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. మూడు రోజుల క్రితం అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టారు. రెగ్యులర్ 207 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కింద 61 సీట్లు, పేమెంట్ సీట్లు 60 కలిపి 328 సీట్లు వర్సిటీకి కేటాయించారు. ఇందులో 213 భర్తీ అయ్యాయి. మరో 115 భర్తీ కావాల్సి ఉంది. తొలివిడత కెమిస్ట్రీలో 29 మంది, అప్లైయిడ్ మ్యాథమ్యాటిక్స్‌లో ముగ్గురు, మ్యాథమ్యాటిక్స్ ఐదుగురు, బయోకెమిస్ట్రీ 11 మంది, బయో టెక్నాలజీ 12 మంది, బాటనీ 9 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ నలుగురు, జాగ్రఫీ ముగ్గురు, మైక్రో బయాలజీ 12 మంది, ఫిజిక్స్‌లో ఆరుగురు, పాలిమర్ సైన్స్‌లో ఒక్కరు, సెరికల్చర్‌లో ఆరుగురు, స్టాటిస్టిక్స్ నలుగురు, జువాలజీలో 12 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఐదుగురు, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 15మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 19 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఒకరు అడ్మిషన్ పొందారు. మొదటి విడతలో ఎక్కువగా సైన్స్ సీట్లు భర్తీ అయ్యాయి. సైన్స్‌లో 157 మంది, ఆర్ట్స్‌లో 56 మంది చేరారు. రెండో విడత అడ్మిషన్‌లు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

కూలిన మృత్యువు..!

- ఇంటి ఎలివేషన్ కూలి వ్యక్తి దుర్మరణం



ఎలివేషన్ కూలడంతో ద్విచక్రవాహనంపైనే మృతి చెందిన వెంకటరాముడు

గుంతకల్లు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా..! మార్కెట్‌కు వెళ్లి దుకాణంలోకి అవసరమైన కాయగూరలు తెస్తా' అని తల్లికి చెప్పి బయటకు వెళ్లిన వెంకటరాముడు (59) తిరిగి ఇంటికి రాకుండానే మృత్యు ఒడికి చేరిన ఘటన గుంతకల్లులో శనివారం జరిగింది. గుంతకల్లులోని ఏకలవ్యనగర్‌కు చెందిన వెంకటరాముడు కిరాణా అంగడిని నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే అంగడికి అవసరమైన సరుకుల కోసం మార్కెట్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అక్కడ అవసరమైన కాయగూరలు కొని వాహనంపై పెట్టుకుని 11:45 సమయంలో ఇంటికి బయల్దేరాడు. ఇది ఇలా ఉండగా మార్కెట్ సమీపంలో ఉన్న పాత భవనాన్ని కూల్చడానికి ఇంటి యజమాని కూలీలతో పైకప్పును పాక్షికంగా తొలగించాడు. అయితే భవనం వర్షానికి నానడం, పైకప్పునకు సపోర్టు లేకపోవడంతో ఇంటి ముందుభాగం (ఎలివేషన్) హఠాత్తుగా కూలింది. ఇదే సమయంలో ద్విచక్రవాహనంపై కూరగాయల సంచులతో అటు వెళ్తున్న వెంకటరాముడిపై పడింది. ఎలివేషన్‌లోని బరువైన సిమెంటు పెల్లలు పడటంతో వెంకటరాముడి తల, ముఖం ఛిద్రమైపోయాయి. ఎలివేషన్ బరువుకు ద్విచక్ర వాహనంపై కూర్చున్న వ్యక్తి కూర్చున్నట్లుగానే మృతిచెందాడు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న తల్లి, భార్య కుమారుడు, బంధువులు బోరున విలపించారు. 'సంతకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరి వచ్చి, కనీసం ముఖం చూడటానికి కూడా వీల్లేని విధంగా మమ్మల్ని విడిచిపోయావా' అంటూ బోరున విలపించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు
వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు
స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల ప్రకటనలు [illegible]
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 10956, 99854 11165
అనంతపురం : 99854 11179, 99854 01208
99854 01251, 77804 27767, 99854 03749
గుంతకల్లు : 89195 18075
హిందూపురం : 97036 18698
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

హనుమద్వాహనంపై శ్రీవారు



హనుమద్వాహనంపై దేవదేవుడు

అలరించిన 'శ్రీనివాస కల్యాణం'

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం శ్రీనివాసుడు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చనలు, తోమాలసేవలు, అలంకారసేవలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నవగ్రహ, దీక్షాహోమాలను నిర్వహించారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన హనుమద్వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలోని వేదికపై కళాకారులు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం ఎంతగానో అకట్టుకుంది.



శ్రీనివాస కల్యాణం.. నృత్య రూపకం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

జీఎస్టీ లబ్ధిపై అవగాహన కల్పించండి

- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. జేసీ శివనారాయణ శర్మ, పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్ వల్లి, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, డ్వామా పీడీ సలీం బాషా, వివిధ శాఖల అధికారులతో తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో తెలియజేసేందుకు అక్టోబరు 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. జీఎస్టీ క్యాంపెయిన్‌కు జిల్లా నోడల్ అధికారిగా జేసీ ఉంటారని, మండల, మున్సిపల్ స్థాయిలో ఇతర శాఖల అధికారులతో కమర్షియల్ టాక్స్ అధికారులు సమన్వయం చేసుకుని అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కూడా జీఎస్టీ గురించి తెలియజేయాలని అన్నారు.

ఇనుప ఖనిజం చోరీపై విచారణ

'కాలవ' వినతికి మంత్రి కొల్లు రవీంద్ర హామీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజక వర్గంలోని ఓబుళాపురం గనుల్లో ఇనుప ఖనిజం చోరీపై విచారణ జరిపిస్తామని గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్ర శాసనసభలో శనివారం తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 2019-24 మధ్యకాలంలో ఓబుళాపురం గనుల నుంచి సుమారు లక్ష టన్నుల ఇనుప ఖనిజాన్ని వైసీపీ నాయకులు అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయన్నారు. వాటి విలువ రూ.30 కోట్ల మేర ఉంటుందని పత్రికల్లో వార్తలొచ్చాయ న్నారు. ఈ విషయంలో నిజానిజాలు వెలికితీయడానికి సమగ్ర విచారణ అవసరమని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కొందరు సీబీఐ సీజ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా... రెండుసార్లు పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారన్నారు. గతంలో ఓఎంసీకి వాహనాలు సరఫరా చేసిన వ్యక్తే ఈ చర్యలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారన్నారు. ఇనుప ఖనిజం దోపిడీదారులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులను తప్పక శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీసేలా దుష్ప్రచారం సాగిస్తున్న వారి వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. భిన్న రాజకీయ పార్టీల నాయకుల సోషల్‌మీడియా దుష్ప్రచారాన్ని ఆదారాలతో ఆయన మంత్రికి వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ... ఇనుప ఖనిజం చోరీపై సమగ్ర విచారణ చేయిస్తామని సభలో హామీ ఇచ్చారు.

వైసీపీ డిజిటల్ బుక్ ప్రారంభం



డిజిటల్ బుక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులపై భవిష్యత్తులో చర్యలు ఖాయమని హెచ్చరించారు. ఎవరికి అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. బాధితులు డీటీడబ్ల్యుఈవైఎస్ఆర్‌సీపీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని తెలిపారు. 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నియోజకవర్గ కేంద్రాల్లో, 29న మండల స్థాయిలో డిజిటల్ బుక్ ఓపెన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌లో బాలకృష్ణ పేరు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఓ ఉన్మాది అని, అతడికి మతిస్థిమితం లేదని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. బాలకృష్ణ పేరు ఇప్పటికే డిజిటల్ బుక్‌లో నమోదైందని అన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించలేదని అన్నారు.

మూడేళ్ల కిందటే అక్రమ రవాణా: డీఎఫ్ఓ



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

రాయదుర్గం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కొండల్లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ముడిఖనిజాన్ని మూడేళ్ల కిందటే అక్రమ రవాణా చేసినట్లు గుర్తించామని డీఎఫ్ఓ చక్రపాణి స్పష్టం చేశారు. రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డిప్యూటీ రేంజ్ అధికారి దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన మైనింగ్ కొండల్లో శనివారం పర్యటించారు. బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్ అటు కర్ణాటక ఇటు ఆంధ్ర సరిహద్దుల్లో ఉంటుందన్నారు. ఈ ప్రాంతాన్ని వివాదాస్పద ప్రాంతంగా 15 ఏళ్లకు ప్రకటించి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. 2009లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల రెండు టిప్పర్లు అక్రమంగా ఖనిజాన్ని తరలించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా సీబీఐ సీజ్ చేసిన ముడిఖనిజం ఎవరికి అప్పగించారన్న విషయం తేలాల్సి ఉందన్నారు.

టమోటా కిలో రూ.19

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం టమోటా కిలో రూ.19తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో అమ్మకాలు జరిగాయన్నారు. మార్కెట్ మొత్తంగా 3వేల టన్నుల కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

సిలిండర్ డెలివరీలో అవకతవకలు

రూ.10వేలు జరిమానా విధించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్యాస్ వినియోగదారుల ఫిర్యాదులతో తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు చేశారు. డెలివరీ వాహనంలో తూకం వేసే మిషన్ లేకపోవడంతో పాటు గ్యాస్ సరఫరా ధ్రువీకరణ పత్రం చూపించేలేక గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం బయటపడింది. దీంతో ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ.10 వేలు జరిమాన విధించారు. సిలిండర్ ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు స్థానికులు అయన దృష్టికి తీసుకొచ్చారు. మరోసారి తూకం లేకుండా సిలిండర్లు డిలివరీ చేస్తే ఏజెన్సీ రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. [illegible] సెల్:7382114647
AJA- 246726

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (ఖడెక్స్ కోర్సు) Goverment సీట్స్‌కి [illegible] సెల్ 9030661651.
AJA- 246725

కావలెను
[illegible] సెల్:9381838140,9000051434.
AJA-SATHISH

ఫ్లాట్ అమ్మబడును
[illegible] MIG, 221 [illegible] 40X63 [illegible] 5.75 సెంట్ల [illegible] 9440488444.
AJA-246731

పాఠకులకు ముఖ్య గమనిక
[illegible]
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

మూడు రోజుల పాటు ధర్మవరంలో మంత్రి

ధర్మవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ధర్మవరంలో పర్యటించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి ఆదివారం అనంతపురంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని, మధ్యాహ్నం 2గంటలకు పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. సోమవారం ఉదయం కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 వరకు స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 30న మంగళవారం ఉదయం 10గంట ల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎన్డీఏ కార్యాలయంలో అధికారు లతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారని హరీశ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆలయ శిఖర కలశం ఏర్పాటు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కొత్తచెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాత దేవరపల్లిలో అతిపురాతన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం పై శుక్రవారం గోపుర కలశాన్ని ప్రతిష్ఠించారు. బంగారుచెన్నేపల్లికి చెందిన అప్పన్నగారి చెన్నరాయుడు మనవళ్లు ఐదేళ్ల క్రితం గోపురాన్ని నిర్మించారు. అయితే పురోహితులు, గ్రామస్థులు మాధవరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు కోరగా వారు స్పందించారు. గర్భగుడిపై దాదాపు రూ. 50వేలు వెచ్చించి తయారు చేయించిన శిఖర కలశాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

తుమ్మలకొండపై ప్రత్యేక పూజలు

అమడగూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మల కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామికి గ్రామస్థులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతియేటా మాదిరి గానే తిరుమలమావాస్య పురస్కరించుకుని ఈ మాసంలో ఉపవాసాలు ముగించి స్వామికి పూజలు చేస్తామని గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల మున్సిపల్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థిని బోయ రోహిణికి వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు చేయూత నందించారు. బోయ రోహిణి ఫ్లోర్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి సింగపూర్ వెళ్తోంది. సింగపూర్ వెళ్లడానికి రూ. 2లక్షల దాకా ఖర్చుఅవుతుంది. అయితే ఆ కుటుంబానికి అంత ఆర్థిక స్థోమత లేదన్న విషయం తెలుసుకున్న వాల్మీకి ఉద్యోగసంఘం నాయకులు రూ. 54,616ను విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి ఈశ్వరయ్య, బీకే ముత్యాలప్ప, జిల్లా కోశాధికారి రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, ప్రధానకార్యదర్శి రాంప్రసాద్, నాయకులు అంగజాల రాజశేఖర్, నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బస్సులో బంగారం ఆభరణాలు మాయం

కదిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో తన బంగారు వస్తువులు మాయం అయినట్లు అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన హేమలత అనే మహిళ ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. పీలేరు పట్టణం శ్రీనివాస నగర్‌కు చెందిన హేమలత బళ్లారిలో ఉన్న తన కుమార్తెను చూడడానికి పీలేరు నుంచి బస్సులో బయలుదేరారు. బస్సు తనకల్లు వద్దకు రాగానే చెడిపోయింది. వెంటనే మరో బస్సులో కదిరికి వచ్చింది. కదిరి బస్సు వచ్చిన తరువాత తన బ్యాగులో బంగారు వస్తువులను చూసుకుంది. తన బ్యాగులో ఉండాల్సిన ఆరు తులాల బంగారు వస్తువులు, ఏటీఎం కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు లాకర్ తాళాలు కనిపించలేదు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నాయకుడు మగ్బూల్‌పై ఫిర్యాదు



సీఐ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కదిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మగ్బూల్‌పై టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్‌తో పాటు మరికొంతమంది శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలక్రిష్ణను విమర్శించే స్థాయి మగ్బూల్‌కు లేదన్నారు. బాలక్రిష్ణపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి నిరాధారారోపణలు మరోసారి చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు హరి, ప్రతాప్, సల్మాన్‌ఖాన్, చైతన్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కదిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు తలుపుల మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలకేంద్రానికి సమీపంలోని వాటర్ ప్లాంటు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పెద్దన్నవారిపల్లిలోని మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి దాదాపు 60కేజీల కాపర్ వైర్‌ను చోరీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఈ సంఘటన జరిగి నాలుగు రోజులైందని, అయితే ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని వారు పేర్కొన్నారు. దొంగలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు పేర్కొన్నారు. ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లికి చెందిన అరవింద్ శనివారం ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కనే వెళ్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొనడంతో అరవింద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ప్రైవేట్ వాహనంలో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

పందుల అపహరణపై ఫిర్యాదు

నల్లమాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తనకు చెందిన పది పందులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు మండల కేంద్రంలోని గంగాధియేటర్ సమీపంలో నివాసమున్న వెంకటయ్య పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోని గూడు తాళం పగలకొట్టి అందులోని పం దులను తోలుకెళ్లి తెలిపాడు. దీంతో రూ. లక్ష నష్టం జరిగిందన్నాడు. పోలీసులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.



ధర్మవరంలో సంతానలక్ష్మిగా రాంనగర్ చౌడేశ్వరి, నరసింహ స్వామిగా శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో గోరకాటి పెద్దమ్మ

పాహిమాం పరమేశ్వరీ..!

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం జిల్లా కేంద్రంలోని వాసవీమాత శాకంబరీగా... సత్యమ్మ దేవత, ఎనుమలపల్లి దుర్గాదేవి, మామిళ్ళకుంట లలితా పరమేశ్వరి లలితా త్రిపుర సుందరిగా దర్శమిచ్చారు. ప్రశాంతి నిలయంలోని గాయత్రి మాతకు విశేష అలంకరణ చేశారు. ధర్మవరం పట్టణంలోని దుర్గమ్మ మీనాక్షిదేవిగా, సాలేవీధి పెద్దమ్మ, శివానగర్ చౌడేశ్వరి రాజేశ్వరిదేవిగా, శ్రీనివాసనగర్‌లో వెంకటేశ్వర స్వామి నరసింహస్వామిగా దర్శనమిచ్చారు. గోరకాటి పెద్దమ్మ, మండలంలోని ఉప్పునేసినవపల్లిలో కొల్హాపురమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తచెరువులోని పెద్దమ్మ లలితత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. రేణుకా యల్లమ్మ, వాసవీ ఆలయాల్లో నవరాత్రిఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బత్తలపల్లిలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శన మిచ్చారు. టీడీపీ నాయకుడు జక్కంపూటి వెంకటేశ్వరచౌదరి అన్నదానం చేశారు. ముదిగుబ్బలోని కన్యకా పరమేశ్వరిని వెంకటేశ్వరస్వామిగా, తాడి మర్రిలో వాసవీ మాతను మధురమీనాక్షిగా అలంకరించారు. కదిరి పట్టణంలో చౌడేశ్వరిని జ్యేష్ఠాదేవిగా, కుమ్మరవాండ్లపల్లి మల్లాలమ్మను మోహినీదేవిగా, మరకత మహాలక్ష్మిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమడగూరులో చౌడేశ్వరీ దేవి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బత్తలపల్లిలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు



పుట్టపర్తిలో శాకంబరిగా వాసవీమాత



కదిరిలో జేష్ఠాదేవిగా చౌడేశ్వరి



కొత్త చెరువులో లలితా త్రిపురసుందరిగా పెద్దమ్మ

మౌలిక వసతులు మెరుగ్గా ఉండాలి

● అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ పీడీ సూచన



సీడీపీఓ కార్యాలయంలో మొక్క నాటుతున్న పీడీ ప్రమీల

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ ప్రమీల అంగన్వాడీ కార్య కర్తలకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలైన నీరు, విద్యుత్, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అలాగే ప్రతికేంద్రం వద్ద మునగ, పాలకూర, పొన్నగంటి, బచ్చలికూర ఖచ్చితంగా పెంచాలని తెలిపారు. అనంతరం వనం- మనం కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఎదుట ఉసిరిమొక్క నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, సూపర్వైజర్‌లు సుజాత, పుష్ప, భారతి, రజిత, అంగన్వాడీ కార్యకర్తలు, నాగమణి, సుజాత, ఉషా పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

తప్పక పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీఓ

బత్తలపల్లి, సెప్టంబరు 27(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలే కాకుండా మహిళలందరూ పౌష్టి కాహారం తీసుకుంటే రక్త హీనత ఉండదని సీడీపీఓ సరస్వతి తెలిపారు. మండల పరిధిలోని కోడేకండ్ల గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం కోడేకండ్ల సెక్టరు కార్యకర్తలతో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పోషక విలువ లు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్టీ'పై అవగాహన



కోటూరులో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న పీడీ నరసయ్య

తనకల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకువాండ్లపల్లి, కోటూరు గ్రామాల్లో శనివారం డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మహిళలకు 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'పై అవగాహన కల్పించారు. గృహోపయోగ వస్తువులపై జీఎస్టీ తగ్గిన విషయం వివరించారు. కొనుగోలు సమయంలో జీఎస్టీ తగ్గించారా లేదా తెలుసుకోవాలన్నారు. డీపీఎం రామమోహన్, ఏసీ రవీంద్ర, ఏపీఎం జయంతి, చంద్రారెడ్డి, నాగార్జున, ప్రవీణ్, జహీరా, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● అమడగూరు: కేంద్రం ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ఎంపీడీఓ మునియప్ప, కూటమి నాయకుల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో దుకాణాల యజమానులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అమడగూరు, మహమ్మదాబాద్‌లో దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపు మేరకు తప్పనిసరిగా వస్తువులను విక్రయించాలని సూచించారు.

గ్రామం యూనిట్‌గా పంటకోత ప్రయోగాలు

● శిక్షణ కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఓ విజయ్‌కుమార్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామం ఇన్సూరెన్సు యూనిట్‌గా పంటకోత ప్రయోగాలు చేపట్టేందుకు కందిపంటను ఎంపిక చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, జిల్లా ఆర్థిక గణాంకాధికారి (సీపీఓ) విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పంటకోత ప్రయోగాలపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఆర్థిక గణాంకాధికారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఓ, జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ జిల్లాలో గ్రామం ఇన్సూరెన్సు యూనిట్‌గా పంటకోత ప్రయోగాలు చేపట్టేందుకు కందిపంటను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 141 యూనిట్లలో మొత్తం 720 పంటకోత ప్రయోగాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మొబైల్‌యాప్ వినియోగం పంటకోత ప్రయోగం ప్రక్రియపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఏఎస్ఓ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖాధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్. డివిజన్ స్థాయి ఏడీఏలు, మండల వ్యవసాయి అధికారులు, హెచ్‌ఓలు, ఏఎస్‌ఓలు, ఏఈఓలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

చెడుపై మంచి విజయమే దసరా

● సంస్కృతి కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి



విజయ చాముండేశ్వరి గాథ సాంస్కృతిక ప్రదర్శన

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి విజయం సాధించ డమే దసరా పండుగ ముఖ్య సందేశమని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీడుపల్లి సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆరురోజులుగా దసర శరన్నవరాత్రులను నిర్వహిస్తున్నారు. శనివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహభరితమైన వాతావరణంలో దసరావేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ తమ కళాశాల చదువులో టెక్నాలజీ అందిపుచ్చుకోవ డంతో పాటుగా సంప్రదాయ విలువలను చాటిచెప్పడం చాల గర్వకారణంగా ఉందన్నారు. వారం రోజులుగా అమ్మవారిని ప్రతిరోజు ఒక రూపంలో ఆరాధిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

రోడ్లపై మురుగునీరు

● ఇబ్బంది పడుతున్న ప్రజలు



కుమ్మరకాలనీలో ఇళ్ల ఎదుట నిలబడిన మురుగు నీరు

కొత్తచెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాల్ నగర్, కుమ్మరకాలనీల్లో మురుగునీరు నిలబడి మడుగులను తలపిస్తోంది. వీధుల్లో రహదారులపై ము రుగునీరు నిలబడడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతు న్నారని, అత్యవసర సమయంలో 108, ఆటో కూడా రాలేని పరిస్థితి నెలకొందని తెలుపుతున్నారు. ఆయా కాలనీల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మెట్ట ప్రాంతంలో నుంచి వచ్చే మురుగు నీరు తమ ఇళ్ల ఎదుట రహదారిపై నిలబడుతోందని అంటున్నారు. దీంతో దుర్వాసన వస్తోందని, ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడదతో విషజ్వరాలు సోకుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరిం చాలంటూ పలుమార్లు పంచాయతీ ఈఓకు, సర్పంచ్‌కు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ కాలవలను నిర్మించాలని ఆ రెండు కాలనీవాసులు కోరుతున్నారు.

భక్తులతో ఖాద్రీశుడి ఆలయం కిటకిట



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కదిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలతో పాటు సెలవులు కావడంతో పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక నుంచి భక్తులు శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందించగా, ఆలయాధికారులు అన్నదానం ఏర్పాటు చేశారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ఉదయం నుంచి ఆలయ శుద్ధి, స్వామివారికి అభిషేకాలు, అలంకరణ చేశారు. అలాగే అర్చనలు, ఆకుపూజ అనంతరం భక్తులకు దర్శనభాగ్యం క ల్పించారు. భక్తులు మొక్కు లు తీర్చుకుని, అన్నదానానికి విరాళాలు అందించారు.

యోగి వేమన మండలంగా మార్చండి

● ఎమ్మెల్యే కందికుంట



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాండ్లపెంట మండలాన్ని ప్రఖ్యాత కవి యోగివేమన మండలంగా పేరు పెట్టాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అసెంబ్లీ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన అసెంబ్లీలో శనివారం మాట్లాడుతూ గాండ్లపెంట మండలంలో ప్రఖ్యాత కవి యోగివేమన సమాధి ఉందని, అక్కడ టూరిజం, రిసార్ట్ ఉందన్నారు. మండల ప్రజల కోరిక మేరకు గాండ్లపెంటను యోగివేమన మండలంగా పేరు మార్చాలని కోరారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

● చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం పట్టణంలోని 13, 28 వార్డులతో ఎటుఉ మండలంలోని రేగాటిపల్లిలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీచేశారు. పేద ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ హయాంలో ధర్మవరంలో కబ్జాలు, రౌడీయిజం అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుతం అలాంటి సమస్యలు లేవన్నారు. ధర్మవరంలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం పను లు చేపడు తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, సరితాల బాష, తోపుదుర్తి వెంకటరాముడు, టీడీపీ 23వ వార్డు ఇన్‌చార్జ్ అడ్రమహేశ్ పాల్గొన్నారు.

న్యాయాధికారులను నియమించండి

● న్యాయవాదుల సంఘం నాయకులు

కదిరి లీగల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న కదిరి కోర్టులకు న్యాయాధికారులను వెంటనే నియమించాలని కదిరి న్యాయవాదుల సంఘం నాయకులు కోరారు. అనంతపురం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ రామకృష్ణప్రసాద్, హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యామసుందర్‌కు వినతి పత్రాలను అందజేశారు. తమసమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కదిరిలో అదనంగా రెండు కోర్టులు అవసరం ఉండగా ఉన్న ప్రత్యేక కోర్టు, రెండు కోర్టులకు న్యాయాధికారులు లేక ఖాళీగా ఉన్నట్లు జిల్లా దృష్టికి తీసుకెళ్లినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే చౌడప్ప తెలిపారు. దీర్ఘకాలంగా న్యాయవాదులు ఎదురుచూస్తున్న అదనపు జిల్లా న్యాయాధికారి కోర్టు ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే చౌడప్ప, సురేంద్ర, సీనియర్ నాయవాదులు సుబ్బరాజుగుప్త, నాగేశయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని బాలుడికి గాయాలు

ధర్మవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక లింగిశెట్టిపాలెం ప్రాంతానికి చెందిన ఓబుళేశు కుమారుడు నితిన్ వేరొకరి ద్విచక్రవాహనంలో వెనుక కూర్చుని వెళ్తున్నాడు. అయితే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొనడంతో నితిన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాలుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్యచికిత్సలు అందించారు. నితిన్ గాయాలై ఆస్పత్రిలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'దొమ్మరి కులం పేరు మార్పులో బలిజ వద్దు'

కదిరి అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దొమ్మరి కులం మార్పులో బలిజ అని చేర్చడం సరికాదని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. దొమ్మరి కులం పేరు మార్చాలంటే ఏదైనా కొత్త పేరును చేర్చాలి తప్ప, గిరి బలిజ అని పెట్టి జీఓ విడుదల చేయడం సరికాదన్నారు. నాయకులు రమేష్‌బాబు, పుల్లయ్య, రవికుమార్, శంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బొగ్గింటివారిపల్లికి దారి కష్టాలు



దారిలో ఉన్న నీరు, బురద

నల్లమాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గింటివారిపల్లి క్వార్టర్సుకు వెళ్లే దారిలో నీరు నిల్వ ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన చిన్న పాటి వర్షానికే అక్కడ నీరు చేరి నిల్వ ఉంది. దీంతో గ్రామానికి వెళ్లడా నికి దారి లేకుండా పోయిందని క్వార్టర్సులో ఉంటున్న వారు ఆవే దన వ్యక్తం చేశారు. బురద, నీటిలోనే వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి దారికి మరమ్మతులు చేయాలని కోరారు.

జ్యోతుల ఊరేగింపు



జ్యోతులను మోస్తున్న మహిళలు

పరిగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఊటకూరు గ్రామంలో వెలసిన దండుమరిగమ్మ దేవాలయం నుంచి చిలమత్తూరు కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు మహిళలు శనివారం జ్యోతులను తీసుకెళ్లారు. ఆనవాయితీగా మేరకు ప్రతిఏటా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు వివరించారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం నాయకులు దసరా పండగను పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, సిద్దలింగప్ప, సూరీ, కిష్టప్ప, రంగనగోపాల్, గట్టు మహేంద్ర, జబీవుల్లా, బాబయ్య, మద్దిలేటి, మురళి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నర్సింగరావు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

రావుడి అంజన్నకు ప్రత్యేక పూజలు



తమలపాకులు, సింధూరంతో స్వామివారికి ప్రత్యేక అంకరణ

అగళి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుడి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. మహిళలు హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆంజనేయస్వామికి సింధూరంతో అభిషేకం చేసి ఆకుపూజ అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి

- తహసీల్దార్ మారుతి

గోరంట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగంలో చేసుకోవాలని బూదిలి ఎస్సీకాలనీ వాసులను తహసీల్దార్ మారుతి సూచించారు. మండలంలోని బూదిలి ఎస్సీకాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు శనివారం నిర్వహించారు. పౌరుహక్కుల చట్టం ద్వారా లభించే హక్కులను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం చూపాలని, ఎస్సీ శ్మశానవాటిక లేక ఇబ్బంది పడుతున్నట్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. శ్మశాన వాటిక స్థలాన్ని గుర్తించామని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉమాశంకర్, గంగాధర్, శ్రీనివాస నాయక్, రామాంజనేయులు, టీడీపీ నాయకులు లక్ష్మీపతి, వెంకటేష్, ప్రభుశంకర్, రవికుమార్, శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఆలూడి ఎస్సీ కాలనీలో శనివారం తహసీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి, హోటల్, దేవాలయ ప్రవేశం తదితర వాటిపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీరాములు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్ఓ నరసింహమూర్తి, మాస్టర్ నరసింహప్ప, ఎస్సీ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న పెనుకొండ

కన్వీనర్ శ్రీరాం యాదవ్



పూర్తయిన రోడ్డును చూపుతున్న నాయకులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో పెనుకొండ దూసుకెళ్లేలా మంత్రి సవిత చేస్తున్నారని పట్టణ కన్వీనర్ శ్రీరామ్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పెనుకొండ పట్టణంలో రూ.5.40కోట్లతో పనులు జరుగుతున్నాయని అలాగే రూ.122కోట్ల నిధులకు సంబంధించి పనులకు టెండరు ప్రాసింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే రైల్వే స్టేషన్‌రోడ్డు, కోనాపురం రోడ్డు, అన్నాక్యాంటీన్ భవన నిర్మాణం, దర్గాపేటలో రూ.82లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ, తదితర పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుట్టూరు నాగరాజు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, ఎగువగడ్డ కృష్ణమూర్తి, షౌకత్, రఘువీరచౌదరి, నరేంద్ర, సుబ్రమణ్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నింకంపల్లి రోడ్డులో మహాచండి అలంకారంలో యల్లమ్మతల్లి



హిందూపురంలో లక్ష్మీనరసింహస్వామి అలంకరణలో పేట వెంకటరమణస్వామి



మడకశిరలో ధనలక్ష్మి అలంకరణలో కన్యాకాపరమేశ్వరి అమ్మవారు

మహాశక్తీ పాహిమాం

మహాశక్తి.. పాహిమాం.. అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా పేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు లక్ష్మీనృసింహుడిగా భక్తులకు దర్శనమిచ్చారు.

హెచ్చరికలు బేఖాతరు

రోడ్డుపై యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు



జాతీయ రహదారిపై వాహనాలకు అడ్డుగా సంచరిస్తున్న పశువులు

సోమందేపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పశువుల యజమానులు పోలీసుల హెచ్చరికలు బేఖాతరు చేస్తున్నారు. రోడ్డుపై పశువులను వదిలితే గోశాలకు తరలిస్తామని, మాటవినకుంటే కేసులు నమోదుచేస్తామని ఇటీవల ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. పట్టణంలో పశువుల బెడద అధికం కావడంతోపాటు 44వ జాతీయరహదారిపై వాటి సంచారం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండటంతో పోలీసులు దీనిపై దృష్టి సారించారు. ఇటు వారపుసంతలో సైతం వీటివల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతుండటం, పట్టణంలో ప్రజలకు, వాహనాలకు అడ్డుగా నిలుస్తుండటంతో వాటివల్ల ఎదురవుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని స్థానికులు సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా కార్యదర్శి రామాంజినేయులు సైతం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యజమానులు పశువులను రోడ్డుపైకి వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా యజమానుల్లో మార్పు కనిపించలేదు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై పశువులు దర్శనమిచ్చాయి. అదే విధంగా జాతీయ రహదారిపై వాహనరాకపోకలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపై సంచరించడం కనిపించింది. దీంతో స్థానికులు, వాహనదారులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలకు అడ్డంకేకాక పోట్లాడుకోవడంతో వాహనదారులు, పాదచారులపైకి వస్తున్నాయి. గతంలో వారపుసంతలో వీటివల్ల అనేకమంది గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా, అధికారులు, పోలీసులు కట్టడి చేయడానికి చేపడుతున్న చర్యలు ఫలితాన్ని ఇవ్వడంలేదు. కేవలం హెచ్చరికలకే అధికారులు పరిమితమవుతున్న నేపథ్యంలో పశువుల యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కల్తీకల్లు విక్రయిస్తే పీడీయాక్ట్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎవరైనా కల్తీకల్లు విక్రయిస్తే వారిపై పీడీయాక్ట్ కేసు నమోదుచేసి జైలుకు పంపుతామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. శనివారం ఏసీ శ్రీరామ్‌తో కలిసి హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టువద్ద ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా కర్టాటక నుంచి ఆంధ్రకు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వెంటనే వేలం వేయాలన్నారు. కల్లు దుకాణాల నుంచి శాంపుల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపాలన్నారు. ఎవరైనా కల్తీకల్లు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పాత ముద్దాయిలను, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. ఒక వ్యక్తిపై రెండుకు మించి కేసులుంటే పీడీయాక్ట్ నమోదు చేయాలన్నారు. ఎక్కువ కేసులున్న వ్యక్తులపై జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకోవాలన్నారు. దసరా, గాంధీ జయంతి సందర్భంగా అదనపు బలగాలతో గస్తీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మీదుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



తూమకుంట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీ

మడకశిర టౌన్/రూరల్ (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు విక్రయిస్తే పీడీయాక్ట్ తప్పదని అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీ నాగమద్దయ్య తెలిపారు. కల్తీకల్లు అరికట్టేలా కల్లు అమ్మకందారులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. శనివారం మడకశిరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఏసీ శ్రీరాంతో పర్యటించారు. ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయిస్తున్నారా..? లేదా..? అన్న అంశాలను పరిశీలించాలన్నారు. ఎక్కడ కూడా నాటుసారా తయారుకాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ తదితరులు ఆయనతోపాటు ఉన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి

పెనుకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రమణ, వైస్ ప్రిన్సిపాల్ నరసింహమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతోకూడిన విద్యా అవసరమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఏఓ కేశవయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కార్లు ఢీ

లేపాక్షి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీవద్ద జాతీయ రహదారిపై శనివారం రెండు వాహనాలు ఢీకొన్నాయి. ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మరోకారు ఢీకొనడంతో కారు వెనుకభాగం దెబ్బతిని చక్రం ఊడిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. లేపాక్షి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మహాగణపతి శోభాయాత్ర

పావగడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నెలకొల్పిన హిందూ మహాగణపతి నిమజ్జనం ఆదివారం భద్రత నడుమ జగరనున్నట్లు విశ్వహిందూపరిషత్, శ్రీరామసేన నాయకులు రామాంజినేయులు, అలుకుందప్ప తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శోభయాత్ర జరుగనుందన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన నాగరాజు శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

'హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సుధాకర్'

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కుల సాధనకై అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి తోట సుధాకర్ అని డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ అన్నారు. శనివారం తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్థంతిని పురస్కరించుకుని ఆయనపై బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బుక్‌లెట్ విడుదల చేస్తున్న అధికారులు

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



పావని

పరిగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐకాన్ జూనియర్ కళాశాల విద్యార్థిని పావని జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 24, 25 తేదీల్లో ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పావని ప్రతిభచూపడంతో జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యం డాక్టర్ సురేష్, అమర్, ప్రిన్సిపాల్ బైడిశెట్టి తదితరులు విద్యార్థినిని అభినందించారు.

ఎమ్మెల్యేని విమర్శించే స్థాయి లేదు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రొళ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను విమర్శించే స్థాయి వైసీపీ మండల కన్వీనర్ నర్సింహారెడ్డికి లేదని మండల టీడీపీనాయకులు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాలకృష్ణ గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదని, స్థాయిని మరిచి ఇష్టానుసారంగా మాట్లాడితే అభిమానుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న, ఏపీఐఐసీ డైరెక్టర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

వాల్మీకులు ఏకతాటిపైకి రావాలి: మాజీ మంత్రి



జ్యోతి వెలిగిస్తున్న శ్రీరాములు, స్వామీజీ తదితరులు

పావగడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకులు ఒకటవ్వాలని మాజీ మంత్రి శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం వైఎస్‌హొసకోటలో వాల్మీకి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాల్మీకులు సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి అందరూ ఒకేతాటిపైకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నిడుగల్ పీఠాధిపతి సంజయ్‌కుమార్ స్వామీజీ, మాజీ ఎంపీ ఉగ్రప్ప, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మణూరు చెరువుకు కృష్ణా జలాలు

మడకశిర రూరల్ సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా కాలువ ద్వారా వచ్చే కృష్ణా జలాలు శనివారం మణూరు చెరువుకు చేరాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆటల్లో గెలుపు ఓటములు సహజం

● మున్సిపల్ చైర్మన్ రమేష్



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గెలుపు ఓటములు సహజమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం ఎంజీఎం పాఠశాల మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ఐదవ కుస్తీ పోటీల చాంపియన్‌షిప్- 2025 ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొనడమే గొప్ప అని అన్నారు. గెలుపు ఓటములను సహజమని ఒకరు గెలిస్తే మరొకరు ఓడాల్సిందేనన్నారు. ఓడినవారు మరోసారి గెలవడానికి మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ అనీల్ కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్లు బేవనహళ్లి ఆనంద్, గంగాధర్, పరిమళ, సుమోశీన, శివ, అమీన్, భార్గవ్, పవన్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై శిక్షణ

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిలర్లకు శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సౌజన్యంతో సహాస్ వాసి సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రతపై పౌరుల భాగస్వామ్యం పెంపు, సుస్థిర పట్టాణాభివృద్ధి అంశాలను వివరించారు. కార్యక్రమంలో సహాస్ ప్రతినిధులు మురళి, జస్లిన్, అశ్విని, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో లబ్ధిని వివరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్

మడకశిర టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తుందని, పేదలకు ఆర్థిక భారం పడకూడదన్న లక్ష్యంతోనే జీఎస్టీ ధరలు తగ్గించడం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పేదల సమస్యలు పరిష్కారం అవుతాయి తదితర అంశాలపై చర్చించారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు బీజేపీ అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని శేఖర్ తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అమరేంద్ర, నాయకులు సుధాకర్, బసవరాజు పాల్గొన్నారు.

నూతన భవనాలు మంజూరు చేయండి

పరిపాలనా న్యాయమూర్తికి న్యాయవాదుల వినతి



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌తో మాట్లాడుతున్న పురం న్యాయవాదులు

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కోర్టులకు నూతన భవనాలు మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను హిందూపురం న్యాయవాదులు శివశంకర్, వన్నేరప్ప, ఇందాద్ కోరారు. అనంతపురంలో వారు ఆయనను శనివారం కలిశారు. జూనియర్ సివిల్ కోర్టు పాత భవనాన్ని కూల్చేందుకు అనుమతి ఇచ్చారని, అధికారులు జాప్యం చేయడంతో భవన నిర్మాణం ఆలస్యమవుతోందని వివరించారు. అదనపు జూనియర్ సివిల్ కోర్టు భవంతిని 1966లో నిర్మించారని, అందులో సబ్ ట్రెజరీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ భవనాలను స్మారక భవనాలుగా ఉపయోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. వాటికి మరమ్మతులు చేయించాలని విన్నవించారు. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ సానుకూలంగా స్పందించారని న్యాయవాదులు తెలిపారు.

పల్లెబాటలో వినతుల స్వీకరణ

చిలమత్తూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే పీఏ వీరయ్య, మండల కన్వీనర్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ రంగారెడ్డి శనివారం పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. శెట్టిపల్లి నుంచి బీదరెడ్డిపల్లికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించాలని, బస్టాండులో డ్రైనేజీ ఏర్పాటుచేయాలని, స్మశాన వాటికలో కంపచెట్లు తొలగించాలని, ఎస్సీ కాలనీలో కొత్త డ్రైనేజీలు ఏర్పాటుచేయాలని తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్థిక అభివృద్ధికి రుణాలు: ఏపీఎం

రొద్దం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి రుణాలు అందిస్తున్నట్లు ఏపీఎం జయచంద్ర పేర్కొన్నారు. శనివారం రొద్దంలోని ఐకేపీ కార్యాలయంలో రొద్దకాంబ మండల సమాఖ్య వార్షిక మహాసభ జరిగింది. ఏడాదిపాటు మండల సమాఖ్య సాధించిన ప్రగతి నివేదికను వివరించారు. భవిష్యత్తులో మండల సమాఖ్య సాధించే లక్ష్యాలను చర్చించారు. శ్రీనిధి, బ్యాంక్ రుణాలు అందుతున్న సేవలు, జీవనోపాదుల ప్రాముఖ్యత తదితర వివరాలను వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అమరావతి, వెలుగు సీసీలు, సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం క్రీడా మైదానంలో వైసీపీ నాయకుడు మనోజ్ మింటు ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచేకాక కర్ణాటక నుంచి 31 జట్లు పాల్గొంటున్నాయి. తొలిరోజు పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, ఉమర్‌ఫారూక్, శాంతరాజు, శ్రీరాములు, దాదాఖలందర్, సిరాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.